# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 136 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 12 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ఈ రాత్రికే భీకర దాడులు తప్పవు


### - మరోమారు ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు



**వాషింగ్టన్, మన జనప్రగతి జూన్ 11:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఈరోజు రాత్రి ఇరాన్‌పై చాలా తీవ్రంగా దాడి చేస్తాం' అని తన సోషల్ మీడియా 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. ట్రంప్ ప్రకటన పశ్చిమాసియా దేశాలలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. కేవలం సైనిక చర్యలకే పరిమితం మిగతా2లో...

## ఎపి నలుగురు రాజ్యసభ అభ్యర్థుల ఏకగ్రీవం

### - పోటీలో మరెవరూ లేకపోవడంతో ప్రకటన



**అమరావతి,మన జనప్రగతి జూన్ 11:**ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేసిన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల మిగతా2లో...




## జగన్, షర్మిల శవ రాజకీయాలు మానుకోవాలి

### బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విమర్శలు

**విజయవాడ,మన జనప్రగతి జూన్ 11:** జగన్, షర్మిల శవ రాజకీయాలు మానుకోవాలని బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు విస్తృతమైన కార్యాచరణను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. తిరుపతి వేదికగా జరగబోయే భారీ ఎన్డీఏ సభలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, బీజేపీ అగ్రనేతలు పాల్గొని కూటమి భవిష్యత్తు ప్రణాళికను వివరించనున్నారని తెలిపారు. 12 ఏళ్ల మోదీ పాలనలో దేశం సాధించిన మిగతా2లో...

## పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం

- కొత్తగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ
- విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్
- వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047'
- నీతి ఆయోగ్ భేటీలో సిఎం చంద్రబాబు వెల్లడి

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 11:**పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి మిగతా2లో...





## ఎపిలో నేటినుంచి బడిగంటలు

### - రెండు నెలల విరామం తరవాత తెరుచుకుంటున్న స్కూళ్లు

**అమరావతి,మన జనప్రగతి జూన్ 11:** ఆంధ్రప్రదేశ్‌లో బడిగంటకు వేళాయింది. దాదాపు రెండు నెలల విరామం తర్వాత స్కూళ్లు తెరుచుకోబోతున్నాయి. శుక్రవారం నుంచి స్కూళ్లు పున:ప్రారంభం అవుతున్నాయని విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఏడాది క్యాలెండర్‌ను విడుదల చేసింది. 229 పని దినాలు, 87 రోజులు సెలవు దినాలుగా ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం విద్యాశాఖ విడుదల చేసింది. రెండు నెలల పాటు చిన్నారులు మిగతా2లో...

## డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

- అన్యాయన్ని ప్రశ్నించే వారంతా కాక్రోచ్‌లే
- మయరోమారు విమర్శలు గుప్పించిన జగన్



**అమరావతి,మన జనప్రగతి జూన్ 11:**డీఎస్సీ నియామకాల అంశంపై మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మరోసారి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డీఎస్సీ అభ్యర్థులు యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల యువత నష్టపోతే ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ మాట్లాడుతూ.. మిగతా2లో...



## పారదర్శకంగానే డిఎస్సీ నిర్వహణ

- పలుమార్లు వివరణ ఇచ్చాం
- ఆన్‌లైన్‌లో వివరాలు పెట్టినా పదేపదే విమర్శలు
- మరోమారు మీడియాతో కోనశశిధర్ వెల్లడి

**అమరావతి,మన జనప్రగతి జూన్ 11:** డీఎస్సీపై రెండుసార్లు సమగ్ర వివరణ ఇచ్చినా నిరాధార ఆరోపణలే మిగతా2లో...

## రొట్టెల పండుగకు భారీగా ఏర్పాట్లు

### - మంత్రి పి. నారాయణ వెల్లడి



**నెల్లూరు,మన జనప్రగతి జూన్ 11:**జిల్లాలోని బారా షహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. పండుగ సందర్భంగా ఏర్పాట్లపై గురువారం నెల్లూరులో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు బారా షహీద్ దర్గాలో రొటెల పండగ జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఈ పండగకు దేశ విదేశాల నుంచి 16 లక్షల నుంచి 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ రొటెల పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. బారా షహీద్ దర్గాకు 415 సంవత్సరాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. రొటెలు పట్టుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని భక్తులు ప్రగాఢంగా మిగతా2లో...

## రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

- మెట్రో ఫేజ్-2ను వెంటనే ఆమోదించాలి
- వివిధ ప్రాజెక్టులపై ప్రధానితో సిఎం చర్చలు
- ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



2లో

## ఇడి కోర్టుకు రాజ్ కసిరెడ్డి

### - లిక్కర్ స్కాంంతో రూ.195 కోట్ల నష్టం



**అమరావతి,మన జనప్రగతి జూన్ 11:**ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఏపీ బేవరెజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసు దేవా రెడ్డి, రాజ్‌కసి రెడ్డిలని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన అనంతరం ఈడి కోర్టులో హాజరు పరిచారు. అయితే, ఈకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, వాసుదేవరెడ్డి తన అధికారిక మిగతా2లో...

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం
12 - 06 - 2026

# పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పారదర్శకంగానే డీఎస్సీ నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ మళ్లీ వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అక్టోబర్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ వస్తోందని చెప్పుకొచ్చారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అపోహాలు వద్దని అన్నారు. గురువారం కోన శశిధర్ మీడియాతో మాట్లాడారు. లీక్‌కు ఎలాంటి స్కోప్ లేకుండా డీఎస్సీ నిర్వహించామని స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్ అర్థం చేసుకోని వాళ్లే అనవసర విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కాల్ లెటర్ వచ్చినంత మాత్రాన ఉద్యోగం వచ్చినట్లు కాదని నోటిఫికేషన్‌లోనే స్పష్టం చేశామని అన్నారు. సర్టిఫికేట్ ధ్రువీకరణ కోసమే కాల్ లెటర్‌లు పంపిస్తామని వివరించారు.ఎక్కడైనా సెలెక్షన్ లిస్ట్ ఉంటుంది తప్ప రిజెక్షన్ లిస్ట్ ఉండదని చెప్పుకొచ్చారు. ఇంకో డీఎస్సీ కూడా వస్తున్నందున అభ్యర్థులు ఈ విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఇంకా అనుమానాలు ఉంటే కమిషనర్ కార్యాలయంలో సమాచారం కోసం అందుబాటులో ఫోన్‌నంబర్ ఉందని, అందరి అనుమానాలు నివృత్తి అవుతాయని కోన శశిధర్ పేర్కొన్నారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా విధానంపై ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎస్సీలో క్రీడా కోటా పారదర్శకంగా అమలు చేశామ నటానికి అన్నీ ఆన్‌లైన్‌లో ఉంచామని స్పష్టం చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పకడ్బందీగా డీఎస్సీ పరీక్ష నిర్వహించామని తేల్చిచెప్పారు. 2019లో ఇంటర్ కాలేజ్ రిక్రూట్‌మెంట్ జరిగిందని, కానీ ఇప్పుడలా చేయలేదని వివరించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్, స్టేట్, ఇంటర్నేషనల్, ఒలింపిక్స్ వరకు సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో చూశామని వెల్లడించారు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయని వారికి ఉద్యోగం రాలేదని అన్నారు. అలాంటి వారు కొందరు కోర్టుకు వెళ్లారని, కోర్టు ఇచ్చే ఆదేశాల ప్రకారం ప్రభుత్వం నడుచుకుంటుందని అజయ్ జైన్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 11:** తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్-2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు 38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్‌ఏఐకి 626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు.
చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ఎలాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ - అమరావతి బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు.

వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

# ఇడి కోర్టుకు రాజ్ కసిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

హోదాను ఉపయోగించి అధిక ధరలకు ముందస్తుగా నిర్ణయించిన సంస్థలకు మద్యం రవాణా టెండర్లు కట్టబెట్టారని ఈడీ అధికారులు గుర్తించారు. ఈ స్కాంలో రాజ్ కసిరెడ్డి, వాసుదేవా రెడ్డికి బంధువులకు చెందిన రూ.441.63 కోట్ల ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకి సంబంధించిన హైదరాబాద్ నివాసంలో ఈడీ అధికారులు గురువారం సోదాలు జరిపారు. తనిఖీల అనంతరం కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.195 కోట్ల మద్యం రవాణా కుంభకోణానికి పాల్పడి, మనీలాండరింగ్‌కి ఆయన పాల్పడినట్లు గుర్తించారు. అనంతరం బేవరేజెస్ కార్పొరేషన్, ఎక్సైజ్ శాఖ రికార్డులను ఈడీ అధికారులు పరిశీలించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసు అధికారిగా ఉన్న వాసుదేవ రెడ్డిని వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనను రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై ఉద్దేశ పూర్వకంగానే తీసుకువచినట్లు గుర్తించారు. ఆయా కంపెనీలకు ఆర్డర్ ఇవ్వాలంటే, ప్రతి కేసుకు రూ.200 నుంచి రూ.250లు కమిషన్ రూపంలో ఆయన తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

# విశాఖ ఉక్కుపై మాట్లాడే హక్కు లేదు


● జగన్‌కు మంత్రి అచ్చన్న హెచ్చరిక



**శ్రీకాకుళం,మన జనప్రగతి జూన్ 11:** విశాఖ ఉక్కుపై మాజీ సీఎం జగన్, వైకాపా నాయకులకు మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కును కాపాడేందుకు రూ.13 వేల కోట్ల ప్యాకేజీ మంజూరు చేయించామని గుర్తు చేశారు. పరిశ్రమ పరిరక్షణేళి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. యూరియా అధిక వినియోగం ప్రమాదకరమని, ఈ ఏడాది నుంచి కొత్తగా యాప్ విధానం అమలు చేస్తున్నామన్నారు. దాని ద్వారా ఎంత యూరియా అవసరమనేది గుర్తించి ముందస్తుగానే స్లిప్ ఇస్తామని, ఎక్కడ కావాలంటే అక్కడ పొందవచ్చునన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్
# అగ్నిప్రమాదం

- పలువురు అధికారుల బదిలీ



**విశాఖపట్టణం,మన జనప్రగతి జూన్ 11:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల చోటుచేసుకున్న భారీ ప్రమాదం నేపథ్యంలో యాజమాన్యం కీలక చర్యలు చేపట్టింది. ప్రమాదం అనంతర పరిణామాల నిర్వహణలో లోపాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో పలువురు సీనియర్ అధికారులపై బదిలీ వేటు పడింది. ముగ్గురు జనరల్ మేనేజర్లు , నలుగురు డిప్యూటీ జనరల్ మేనేజర్లు బదిలీకి గురయ్యారు. వీరిలో కొందరిని హెచ్‌ఆర్ , టౌన్‌షిప్ మెయింటెనెన్స్ వంటి విభాగాల నుంచి ఉత్పత్తి విభాగాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వచ్చినట్లు సమాచారం. ప్రమాదం తర్వాత పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమయ్యారనే అభిప్రాయంతోనే యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే విషయంపై కార్మిక సంఘాలు కూడా స్పందించాయి. ప్రమాదం అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను అధికారులు సక్రమంగా హ్యాండిల్ చేయలేక పోయారని, అందుకే ఈ బదిలీలు జరిగాయని యూనియన్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, యాజమాన్యం నుంచి ఈ బదిలీలపై అధికారిక వివరణ ఇంకా వెలువడలేదు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి నివేదిక, అంతర్గత విచారణ ఫలితాలు వెలుగులోకి వచ్చిన తర్వాత మరిన్ని పరిపాలనా చర్యలు ఉండే అవకాశముందని పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ఈ పరిణామాలు ఉద్యోగులు, కార్మిక సంఘాలు, పరిశ్రమ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# ఈ రాత్రికే భీకర దాడులు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా, ఇరాన్‌కు అత్యంత కీలకమైన చమురు, సహజవాయు మౌలిక వసతులపై కూడా నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌కు ప్రధాన చమురు ఎగుమతి కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపం సహా పలు చమురు మౌలిక వసతులను నియంత్రణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో వెనెజువెలాపై అనుసరించిన వ్యూహంతోనే ఇరాన్‌ను నియంత్రణలోకి తీసుకుంటామన్నారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన, రాడార్, క్షిపణి నిరోధక వ్యవస్థలతో పాటు రక్షణ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు ఇప్పటికే నాశనమయ్యాయి. సమీప భవిష్యత్తులో ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఆయా మార్కెట్లపై నియంత్రణ సాధిస్తాం. వెనెజువెలాలో చేసిన మాదిరిగానే ఇరాన్‌లో కూడా మా ప్రణాళిక ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# ఎపి నలుగురు రాజ్యసభ అభ్యర్థుల ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల సంఘం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. రాజ్యసభ సభ్యులుగా భాష్యం రామకృష్ణ, సానా సతీష్, చింతకాయల విజయ్, లింగమనేని రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. నామినేషన్ల పరిశీలన అనంతరం ఇతర అభ్యర్థులు ఎవరూ పోటీలో లేకపోవడంతో ఎన్నిక అవసరం లేకుండానే వీరి ఎన్నిక ఖరారైంది. రాజ్యసభ ఎన్నికల పక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణకు నిర్ణయించిన గడువు ముగియడంతో, మిగిలిన అభ్యర్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాలుగు రాజ్యసభ స్థానాలు భర్తీ అయ్యాయి. కొత్తగా ఎన్నికైన సభ్యులు త్వరలోనే రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరి ఎన్నికపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జగన్, షర్మిల శవ రాజకీయాలు మానుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రగతిని, ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని, 2047 నాటికి 'వికసిత్ భారత్, వికసిత్ ఏపీ' లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఇటీవల విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ఐరన్ ఓర్ ప్రమాదంలో కార్మికులు మరణించడం అత్యంత బాధాకరమని పీవీఎన్ మాధవ్ అన్నారు. జగన్ అక్కడకు వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. శవాలను అడ్డం పెట్టుకుని జగన్ రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. విశాఖ స్టీల్ ఎలాంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, అది ప్రైవేటు పరం కాకుండా ఆపింది తామేనని స్పష్టం చేశారు. 'స్టీల్ ఎలాంట్ ప్రైవేటు పరం కాకుండా నేనే చేశాను అని జగన్ ఎలా చెప్పుకుంటారు?' అని ప్రశ్నించారు.

# ఎపిలో నేటినుంచి బడిగంటలు

(మొదటి పేజీ తరువాయి)

ఆటాపాటలతో ఎంజాయ్ చేశారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఇప్పుడు మళ్లీ బ్యాగ్‌లు భుజాన వేసుకుని.. పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం దగ్గర పడింది. నేటితో వేసవి సెలవులు ముగియడంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. విద్యాశాఖ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం.. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 పని దినాలు ఉండగా, 87 రోజులు సెలవులు కేటాయించారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు పాఠ్యాంశాల పూర్తి, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో దసరా, సంక్రాంతి, క్రిస్మస్ తదితర ప్రధాన పండుగల సందర్భంగా సెలవులను ప్రకటించారు. అలాగే ప్రభుత్వ సెలవులు, ఆదివారాలు కలిపి మొత్తం 87 రోజుల విరామం లభించనుంది.అంతేకాకుండా విద్యాశాఖ వార్షిక పరీక్షలు, త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, సమయపాలన పాటించడం లక్ష్యంగా పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించినట్లు పేర్కొంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకునే అవకాశం లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరై విద్యలో మరింత రాణించాలని విద్యాశాఖ ఆకాంక్షించింది.

# డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

'ఎవరైనా మమ్మల్ని కాక్రోచ్ పార్టీ అని పిలుస్తారా లేదా అనేది పక్కన పెడితే.. డీఎస్సీ అభ్యర్థులు యువకులు. వారి భవిష్యత్తు, వారి ఉద్యోగ అవకాశాల గురించి మాట్లాడుతున్నాం. వారికి న్యాయం చేయకపోతే ప్రభుత్వం తన బాధ్యతను ఎలా నిర్వర్తించినట్లు అవుతుంది' అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని వైఎస్ జగన్ అన్నారు. యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ హక్కుల కోసం గళమెత్తడం సహజమని పేర్కొన్నారు. ప్రస్తుతం తరచూ ప్రస్తావనలోకి వస్తున్న 'జెన్ జీ' యువత కూడా ఈ వ్యవస్థలో భాగమేనని.. వారి ఆశయాలు, ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని వ్యాఖ్యానించారు. 'యువత కలలను, ఆశలను నలిపేస్తే కోట్లాది మంది ప్రజలు ఒకేసారి బయటకు వస్తారు. వారిని ఎవరైనా కాక్రోచ్‌లు అని పిలిస్తే, న్యాయం కోసం పోరాడే వారందరూ కాక్రోచ్‌లే అవుతారు. అలాంటి పోరాటంలో నేను కూడా వారిలో ఒకడిని' అని జగన్ అన్నారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, యువతకు అన్యాయం జరిగితే మౌనంగా ఉండబోమని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అభ్యర్థుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని, వారి భవిష్యత్తుతో ఆటలాడకూడదని సూచించారు. డీఎస్సీ అవకతవకలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దగా పడ్డ ప్రతి వర్గాన్ని కలుపుకుని ఉద్యమాన్ని మరింత బలంగా కొనసాగిస్తామని జగన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలపై రాష్ట్రంలో కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో మాజీ సీఎం జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

# రొట్టెల పండుగకు భారీగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసిస్తారని చెప్పారు. అందుకే ప్రతీ ఏడాది భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతోందన్నారు. క్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై చర్చించారు. అలాగే సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24వ తేదీ లోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగుకు పశుసంపదే బలం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

- గూడూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన
- రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని సూచన



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 11:-** ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. గూడూరు మండలంలోని రైతులు శేఖర్, రామకృష్ణ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పొలాలను గురువారం ఆమె పరిశీలించారు.రసాయన ఎరువుల వినియోగం రైతుల ఖర్చులను పెంచుతోందని, పశుసంపద ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పశువుల పేడ భూసారాన్ని పెంచి పంటల పెరుగుదలకు దోహదపడుతుందన్నారు.రైతు శేఖర్ తక్కువ పెట్టుబడితో గోరుచిక్కుడు, గోంగూర, మెంతికూర, కొత్తిమీర వంటి పంటల ద్వారా మంచి ఆదాయం పొందుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ అనుభవాలను ఇతరులతో పంచుకుని మరింత మందిని ఈ విధానంలోకి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.అనంతరం రైతు రామకృష్ణ పొలంలో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల విజయగాథలను గ్రామస్థాయిలో ప్రచారం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.**ఎరువుల సరఫరాలో పారదర్శకతకు సూచన** గూడూరులోని ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. యాప్‌లో సాంకేతిక సమస్యలపై అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, తహశీల్దార్ వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కర్నూలు క్రీడాకారుల ఎంపిక



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 11:-** రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కర్నూలు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు.విజయనగరంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల జాబితాను బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ కర్నూలు జిల్లా కార్యదర్శి టి. తేజ వెల్లడించారు.బాలుర విభాగంలో ఎస్.ఎం.డి. రఫాన్ (33 కేజీలు), అబ్దుల్ రెహ్మాన్ (37 కేజీలు), ఎం.కే. భారత్ (40 కేజీలు), టి. కళ్యాణ్ కృష్ణ (43 కేజీలు), మనీష్ రాజ్ (46 కేజీలు), మల్లికార్జున రెడ్డి (49 కేజీలు), తిరుమలేష్ (61 కేజీలు), ఎస్. అబ్దుల్ అహ్మద్ (70 కేజీలు) ఎంపికయ్యారు.బాలికల విభాగంలో సాజియా (55 కేజీలు), సానియా (61 కేజీలు) రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.తేజ మాట్లాడుతూ..రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాక్సింగ్ శిక్షకుడు నాగరాజ్‌తో పాటు విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# శివానందపురంలోని 3, 4, 5వ రోడ్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

- రూ.20 లక్షల వ్యయంతో నూతన రోడ్ల నిర్మాణం: ఎమ్మెల్యే మాధవి రెడ్డి



**కడప మన జన ప్రగతి జూన్ 11:-**కడప నగరంలోని శివానందపురం ప్రాంతంలో 3, 4, 5వ రోడ్ల అభివృద్ధి పనులకు గురువారం కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి భూమిపూజ నిర్వహించారు. పాలకొండ దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని శివానందపురంలో రూ.20 లక్షల వ్యయంతో నూతన రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నగర శివారు ప్రాంతాల్లోని కాలనీలు, గ్రామాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కడప నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బ్రహ్మసాగర్ నుంచి నీటి సరఫరా కోసం త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడం తమ ప్రాధాన్యత అని చెప్పారు.అదేవిధంగా దేవునికడప చెరువు, బుడ్డాయిపల్లె చెరువు, పక్కిరిపల్లె చెరువుల సుందరీకరణ పనులు చేపట్టి, ప్రజలకు వాకింగ్ ట్రాక్‌లు, వినోద సదుపాయాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, సివిల్ సప్లైస్ డైరెక్టర్ సుబ్బరాయుడు యాదవ్, మన్సూర్ అలీ ఖాన్, వేణుగోపాల్ రెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, సుబ్బరాయుడు, హనుమంతు, రమణ, మద్దూరి రాయుడు, మనోజ్, కార్పొరేషన్ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి

## స్వర్ణ వార్డు కార్యాలయాల ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 11:-**ప్రజలకు వేగవంతమైన,నాణ్యమైన సేవలు అందించాలని స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు. గురువారం గూడూరు మండలంలోని 4వ, 6వ స్వర్ణ వార్డు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు.నవచేతన యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్, చిన్నారుల ఆరోగ్య వివరాలు, అండర్‌వెయిట్ పిల్లల గుర్తింపు, గర్భిణుల నమోదు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు, యోగాంధ్ర నమోదు, గృహ నిర్మాణాల పురోగతి, ఈ-కేవైసీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.మహిళా పోలీసు కార్యక్రమాలపై ఆరా తీసిన కలెక్టర్, టీనేజ్ బాలికల వివరాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నివారణ, బాలికల భద్రత, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి సంబంధించి సమగ్ర రికార్డులు నిర్వహించాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.మహిళా పోలీసులకు ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్, చిన్నారుల ఆరోగ్య లోపాల గుర్తింపు, బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ప్రత్యేక అధికారి భాస్కర్ నాయుడును ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, తహశీల్దార్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే ప్రభుత్వ ధ్యేయం:ఎస్ఐ సుస్మిత

- శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహణ




**వీరబల్లి మన జనప్రగతి జూన్ 11:-**మహిళలు,చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి రక్షణ కోసం ప్రవేశపెట్టిన శక్తి యాప్ ఎంతో ఉపయోగకరమని వీరబల్లి ఎస్ఐ సుస్మిత తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సిబ్బంది, మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సుస్మిత మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వేధింపులు, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు,మార్ఫింగ్ ఫొటోలతో బెదిరింపులు వంటి ఘటనలను అరికట్టేందుకు శక్తి యాప్ సమర్థవంతంగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఆపద సమయంలో మహిళలు యాప్ ద్వారా పోలీసులకు తక్షణ సమాచారం అందిస్తే, వారి ప్రస్తుత స్థానాన్ని గుర్తించి పోలీసులు వెంటనే స్పందించి రక్షణ కల్పిస్తారని వివరించారు.శక్తి యాప్‌లో 13 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి మహిళ తన మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన పోలీసు సహాయం అందించడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



# పులివెందులలో కూటమి భారీ బైక్ ర్యాలీ సక్సెస్







- పెన్షన్లు,సంక్షేమ పథకాల్లో స్పష్టమైన మార్పు
- పులివెందులలో వైఎస్సార్సీపీ దోపిడీ,ప్రజాధనం వృథా!
- రౌడీయిజం అంతం ప్రశాంతంగా పులివెందుల
- మున్సిపల్ ఎన్నికల్లో కూటమిని గెలిపించండి
- పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి

**పులివెందుల అర్బన్ మన జానప్రగతి జూన్ 11:**కేంద్ర,రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పులివెందులలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ అత్యంత విజయవంతమైంది.కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేసి, గ్రాండ్ సక్సెస్ చేసిన తెలుగుదేశం,జనసేన,బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు మరియు పవన్ కళ్యాణ్ అభిమానులకు బీటెక్ రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ ప్రతిపక్ష వైఎస్సార్సీపీ ఈ రోజును 'వెన్నుపోటు దినం'గా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండించారు.గత ప్రభుత్వ వైఫల్యాలను,అవినీతిని ఎండగడుతూ కూటమి సాధించిన ప్రగతిని ప్రజల ముందుంచారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును గత ప్రభుత్వంతో పోలుస్తూ బీటెక్ రవి పలు కీలక విషయాలను ప్రస్తావించారు.జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పెన్షన్‌ను రూ. 2000 నుండి రూ.3000కి పెంచడానికి ఎంతో సమయం తీసుకుంటే,చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే ఒకేసారి రూ.3000 నుండి రూ.4000కి పెంచి తమ నిబద్ధతను చాటుకున్నారన్నారు.గతంలో అమ్మఒడి పథకానికి ఎన్నో ఆంక్షలు ఉండేవని కానీ కూటమి ప్రభుత్వం దానిని తల్లికి వందనం గా మార్చిందని చెప్పారు.వేంపల్లి మండలం ఉదాహరణగా చెప్తూ ఒకే ఇంట్లో ఎంతమంది స్కూలుకు వెళ్లే పిల్లలు ఉంటే,అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు.సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామని,అలాగే దీపం పథకం కింద ఇప్పటికే రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామని గుర్తుచేశారు.చంద్రబాబు,లోకేష్‌లపై ఉన్న నమ్మకంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని మేనిఫెస్టోలో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాల కల్పన లేదా నిరుద్యోగ భృతిని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.పులివెందుల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి కాంగ్రెస్,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలే పాలించినా ఇక్కడ రియల్ ఎస్టేట్ వృద్ధి కానీ,ఇతర ప్రాంతాల వారు వచ్చి స్థిరపడే వాతావరణం కానీ లేకుండా పోయిందని బీటెక్ రవి విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు పనుల పేరిట,పాత బస్టాండ్ వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహాల కూల్చివేత,పునర్నిర్మాణాల పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారని ఎర్రవల్లి చెరువు నింపడానికి రూ.100 నుండి రూ.150 కోట్లు వైఎస్సార్సీపీ నాయకులు తమ అనుచరులకు దోచిపెట్టారు. కానీ మేము కేవలం రూ.20 లక్షల సొంత నిధులతో ఆ చెరువును నింపాం.అని ఆయన వెల్లడించారు.చిన్నరంగాపురం,పెద్దరంగాపురం,వెంకట ాపురం,ఇడుపులపాయ వంటి గ్రామాల్లో పనులు అసంపూర్తిగా వదిలేశారని, అక్కడికి ఓట్లు అడగడానికి వెళ్తే మహిళలు పరకలతో కొట్టే పరిస్థితి ఉందన్నారు.ఆ అసంపూర్తి పనులన్నీ చంద్రబాబు పర్యటనలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు.గత రెండేళ్ల కూటమి పాలనలో పులివెందులలో ఏ వ్యాపారస్తుడిపైనా దౌర్జన్యం, రౌడీయిజం,బెదిరింపులు జరగలేదని, సామాన్య ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారని బీటెక్ రవి పేర్కొన్నారు.గతంలో మట్కా, జూదం నిర్వహించి ఫ్లెక్సీలు వేసుకున్న వారిని నగరం నుండి బహిష్కరించామని చెప్పారు.ప్రస్తుతం డీఎస్పీ ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ బ్రహ్మాండంగా మెయింటైన్ అవుతోందని,రాజకీయ హత్యలు,ఫ్యాక్షన్ గొడవలు లేని పులివెందులను చూస్తున్నామని అన్నారు.జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ కేవలం నామమాత్రమేనని ఆయన కనీసం ఒక వీఆర్వోకు,ఎంఆర్ఓకు లేదా కలెక్టర్‌కు ఫోన్ చేసి ప్రజల సమస్యలు తీర్చిన సందర్భం లేదని ఎద్దేవా చేశారు.తాడేపల్లిలో జగన్‌ను కలవాలన్నా,హెలిప్యాడ్ దగ్గరకు వెళ్లాలన్నా అవినాష్ రెడ్డి లేదా శంకర్ రెడ్డిల పేర్లు రాసివ్వాల్సిన దుస్థితి ఉండేదన్నారు.స్థానిక ఎంపీ అవినాష్ రెడ్డిపై విమర్శలు చేస్తూ ఆయన వెనక ఉండే కేఎన్ఆర్ భార్య బ్యాంకు ఖాతాలోనే రూ.19 కోట్ల అవినీతి సొమ్ము దొరికిందని, ఒక పీఏ స్థాయి వ్యక్తి దగ్గరే అంత డబ్బు ఉంటే జగన్ రెడ్డి ఎంత సంపాదించి ఉంటారో ప్రజలు ఆలోచించాలని కోరారు.గత జెడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్లు వేయనివ్వకుండా గంజాయి,మట్కా, క్రికెట్ బెట్టింగ్ కేసులతో బెదిరించిన సంస్కృతి వైఎస్సార్సీపీదని మండిపడ్డారు.ఈసారి పులివెందుల ప్రజల మద్దతు కూటమికే ఉందని ధీమా వ్యక్తం చేశారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమికి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక ఫండ్స్ తీసుకొచ్చి పులివెందులను మరింత అద్భుతంగా అభివృద్ధి చేస్తామని బీటెక్ రవి పిలుపునిచ్చారు. పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సూరం ఈశ్వర్ రెడ్డి మృతికి నివాళులర్పించిన శ్రీకాంత్ రెడ్డి



**రామాపురం మన జనప్రగతి జూన్ 11:–**రామాపురం మండలం నల్లగుట్టపల్లె కస్పాకు చెందిన సూరం ఈశ్వర్ రెడ్డి (57) ప్రమాదవశాత్తు బుధవారం రాత్రి మృతి చెందారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి గురువారం నల్లగుట్టపల్లెలోని వారి నివాసానికి వెళ్లి ఈశ్వర్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈశ్వర్ రెడ్డి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొని ఈశ్వర్ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మొలకలచెరువు నూతన తహసీల్దార్ బి.రెడ్డెన్న



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 11:–** మొలకలచెరువు నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి. రెడ్డెన్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి. రెడ్డెన్న కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొలకల చెరువు మండల పరిధిలో రెవెన్యూ శాఖ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భూ సంబంధిత వ్యవహారాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అంది ంచేందుకు కట్టుబడి ఉంటానని తహసీల్దార్ బి. రెడ్డెన్న తెలిపారు.

## మలేరియా రహిత గ్రామం కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలి



**బొమ్మనహల్ మన జనప్రగతి జూన్ 11:–**మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మండల పరిధిలో దేవగిరి ఆర్‌డీటీ కాలనీలో గ్రామ ప్రజలకు మలేరియా నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్ మాట్లాడుతూ..సిబ్బంది మలేరియా వ్యాధి వ్యాప్తి,నివారణ చర్యలు మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు,మలేరియా వ్యాప్తికి కారణమయ్యే దోమలు మురికి నీటి కుంటలు,పాడుబడ్డ రోళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు,పాత టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో వృద్ధి చెందుతాయని తెలిపారు, అందువల్ల ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు,ఇంట్లో ఉపయోగించే నీటి డ్రమ్ములు,కూలర్లు, పూలకుండీలు, ట్యాంకులు మరియు ఇతర నీటి పాత్రలను వారానికి ఒకసారి పూర్తిగా శుభ్రపరచి,గంటసేపు ఆరబెట్టి తిరిగి నీటిని నింపుకోవాలని తెలిపారు,అలాగే అన్ని నీటి పాత్రలకు మూతలు ఉంచడం ద్వారా దోమల పెరుగుదలను నివారించవచ్చని వివరించారు,ఈ సందర్భంగా దోమలు పుట్టకూడదు,దోమలు కుట్టకూడదు,దోమతెరలు వాడండి దోమకాటు నుంచి రక్షణ పొందండి,చిన్న దోమ,పెద్ద ప్రమాదం,వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,మలేరియా రహిత గ్రామం నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.అనంతరం గ్రామ ప్రజలకు ఆడియో ప్రచారం ద్వారా మలేరియా నివారణ చర్యలు, దోమల నివారణ పద్ధతులు, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్,రమాదేవి,ఆశా కార్యకర్తలు శ్రావణి,లక్ష్మీదేవి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 'వెన్నుపోటుకు రెండేళ్లు' పులివెందుల ర్యాలీని విజయవంతం చేయండి..!

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు పులివెందులలో భారీ ర్యాలీ
- వేముల మండలం నుంచి భారీగా తరలిరావాలని నాగేళ్ల సాంబశివరెడ్డి పిలుపు



**వేముల మన జనప్రగతి జూన్ 11:–**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో భాగంగా నేడు పులివెందులలో చేపట్టనున్న ర్యాలీని విజయవంతం చేయాలని వేముల మండల వైసీపీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి కోరారు. మాజీ ముఖ్యమంత్రి,వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు,ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన గురువారం ఉదయం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా నాగేళ్ల సాంబశివరెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలు,సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందనీ..రెండేళ్ల పాలనలో రైతులు,మహిళలు,యువత,విద్యార్థులు,ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం నిరాశపరిచిందని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచిన తీరును ఎండగట్టేందుకే 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం అనగా "నేడు ఉదయం 9:00 గంటలకు పులివెందులలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు" నిర్వహించే ర్యాలీలో వేముల మండల వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విలువలతో కూడిన విద్యే లక్ష్యం:ప్రభుదాస్

- కాకినాడలో బాసిల్ వుడ్ స్కూల్ ప్రారంభించిన చాగంటి కోటేశ్వరరావు





**కాకినాడ మన జనప్రగతి జూన్ 11:–**విద్యార్థులకు నైతిక విలువలు, ఆధ్యాత్మిక అవగాహనతో కూడిన విద్యను అందించడమే బాసిల్ వుడ్ స్కూల్ లక్ష్యమని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ప్రభుదాస్ తెలిపారు. కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన బాసిల్ వుడ్ స్కూల్‌ను ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాష్ట్ర నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించిన అనంతరం, ప్రభుదాస్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు నారాయణం మురళి, హిమబిందు దంపతులతో కలిసి రిబ్బన్ కత్తిరించి స్కూల్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం విద్య కేవలం పోటీ పరీక్షలు, ఉద్యోగాలు, సంపాదనకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సంస్కారం, నైతిక విలువలు, గురువులు, తల్లిదండ్రుల పట్ల గౌరవ భావం పెంపొందించే లక్ష్యంతో ఈ విద్యాసంస్థను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ప్రభుదాస్ మాట్లాడుతూ, బాసిల్ వుడ్ స్కూల్ తొలి శాఖ బెంగళూరులో విజయవంతంగా నిర్వహించబడుతోందని, ఇప్పుడు కాకినాడలో రెండో శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ఆడుతూ పాడుతూ నేర్చుకునే విధానంతో పాటు భాగవతం, భగవద్గీత వంటి గ్రంథాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. విద్య పూర్తి చేసిన తరువాత జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనేలా విలువలతో కూడిన విద్యను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీవన్, కే. రామచంద్రుడు, కృష్ణయ్యతో పాటు పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేనానికి కులాన్ని అంటగట్టొద్దు..!

- ద్వారంపూడి దగ్గరున్న కాపు నేతలు కళ్ళు తెరవండి



**కాకినాడ మన జనప్రగతి జూన్ 11:–** జనసేనాని, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజానేతని అతనికి కులాన్ని అంటగట్ట వద్దని వైసీపీ కాపు నేతలను జనసేనకు చెందిన కాపు నాయకులు సూచించారు. అలాగే కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి దగ్గర ఉన్న కాపు నాయకులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పార్టీ నాయకులను తిట్టించి వివాదాలు రేపుతున్నాడని ఇది గ్రహించాలని సాటి కాపు నాయకులను కోరారు. గురువారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో డిప్యూటీ సీఎం పవన్ పైన అవసర వ్యాఖ్యలు చేసిన వైసీపీ కాపు నాయకుల తీరును వారు ఖండించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు నల్లం శ్రీనివాస్, దుగ్గన బాబ్జి, డాక్టర్ చిట్ల కిరణ్, సానా సతీష్ తదితరులు ప్రసంగించారు. సామాజిక అంశాల పైన పవన్ పార్టీ నిర్మించి అన్ని వర్గాల కోసం పనిచేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలో పవన్ పైన ప్యాకేజీ అందని వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అతని దగ్గరున్న కాపు నాయకులతో రాజకీయాలు చేస్తున్నాడన్నారు. ఇతను వ్యవహారం వల్ల కాపుల మధ్య తగాదాలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నట్లు చెప్పారు. కాపులంతా ద్వారంపూడి చేస్తున్న కుట్రలకు అడ్డుకట్ట వేసి ఆయనను రాజకీయాల నుంచి దూరం చేయాలని కాపులకు సూచించారు. పవన్ కళ్యాణ్ 'కు అండగా ఉంటామని పొత్తులో భాగంగా కూటమి ప్రభుత్వంకు పనిచేస్తామని శ్రీనివాస్, బాబ్జి, కిరణ్, సతీష్ తదితరులు పేర్కొన్నారు.

## యోగతో శారీరక,మానసిక ఆరోగ్యం సాధ్యం: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**హార్స్లీ హిల్స్, మన జనప్రగతి జూన్ 11:–** యోగాంధ్ర 2026 జిల్లాస్థాయి కార్యక్రమంలో భాగంగా...ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో.. వందల మందితో అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదట నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం యోగా శిక్షకులు డా పాల్ బ్రహ్మకుమార్ ఆధ్వర్యంలో దాదాపు గంట పాటు పాల్గొన్న వారందరూ యోగాసనాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని అన్నారు. యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగకు కేటాయించాలని సూచించారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ యోగను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర2026 కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈనెల 14న పర్యాటక ప్రాంతమైన బోయకొండ మరియు 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, పర్యాటక రీజనల్ డైరెక్టరు డా. రమణప్రసాద్, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, సమాచార శాఖ ఏడి పురుషోత్తం, ఏపీటీడీసి శ్రీనివాసరావు, డీఈఓ సుబ్రమణ్యం, డిపిఒ రాధమ్మ, డిఆర్డిఓ పీడీ నాగేశ్వరరావు, డిడిఓ లక్ష్మీపతి, తహసిల్దార్, ఎంపీడీవో, మండల అధికారులు, అంగన్వాడి మరియు హెల్త్ వర్కర్లు, ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తొగటవీర క్షత్రియ విద్యార్థులకు జూన్ 14న ప్రతిభా పురస్కారాలు



**కడప మన జనప్రగతి జూన్ 11:–** 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు జూన్ 14న ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగరశాఖ అధ్యక్షుడు కల్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు తెలిపారు. సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గత 13 సంవత్సరాలుగా ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా జూన్ 14 ఆదివారం ఉదయం 10 గంటలకు కడప ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ రైల్వే నాగ్‌పూర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గాలి శ్రీనివాసులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టేకూరు సుదర్శన్, కార్యనిర్వాహక కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు చౌడం సూరిబాబు, గౌరవాధ్యక్షులు పల్లా బాలచౌడన్న, సుంకర రామచంద్రుడు, బొలిశెట్టి వెంకటస్వామి, కాల్వ వాగీష్, టేకూరు పుష్పాంగద, దొండ్ల వెంకటరమణ, బండారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దు గ్రామాల్లో జూదం జోరు.. పోలీసుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

- అక్రమ పేకాటతో పేద కుటుంబాలు దెబ్బతింటున్నాయంటూ మహిళల ఆందోళన
- జిల్లా ఎస్పీ జగదీష్ తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్




**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 11:–**ఉరవకొండ రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో అక్రమ జూద కార్యకలాపాలు విస్తృతంగా కొనసాగుతున్నాయంటూ స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాల్తూరు, హావలిగి, కరకముక్కల గ్రామ శివారులతో పాటు గోవిందవాడ, బొమ్మనహాల్, దర్గా హోన్నూరు పరిసర ప్రాంతాలు పేకాట అడ్డాలుగా మారాయని ఆరోపిస్తున్నారు .ప్రతిరోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన కూలీలు, స్వల్ప ఆదాయ వర్గాల ప్రజలు జూదానికి బానిసలవుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును పేకాటలో కోల్పోవడంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని వారు వాపోతున్నారు. అక్రమ జూదాల వెనుక కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పేకాటతో పాటు మొబైల్ జూదాలు కూడా విస్తరిస్తున్నప్పటికీ వాటిని అరికట్టడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జూద వ్యసనం కారణంగా కొన్ని గ్రామాల్లో దొంగతనాలు పెరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. డబ్బు కోసం కొందరు చోరీలకు పాల్పడుతున్నారని, ఇటీవల రైతులు నిల్వ ఉంచిన మిరప పంట కూడా దొంగిలించబడిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటున్నారు. ఈ ఘటనలను నియంత్రించడంలో కూడా పోలీసులు ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. ఉరవకొండ సర్కిల్ పరిధిలో ఇద్దరు సీఐలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం రూరల్ సీఐ పదవి ఖాళీగా ఉందని, అర్బన్ సీఐ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని సమాచారం. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో నేర నియంత్రణపై ప్రభావం చూపుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ జూద దందాపై జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక దృష్టి సారించి, క్రైమ్ కంట్రోల్ బృందాలతో ఆకస్మిక దాడులు నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి పేద కుటుంబాలను కాపాడాలని గ్రామస్తులు, మహిళలు కోరుతున్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
12 - 06 - 2026

# మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుభ్రత - పరిశుభ్రత

**ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం చేపట్టిన 'మన ఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ**






**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 11:-** రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 'మన ఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రతి ఒక్కరూ తమ సొంత ఆస్తిగా భావించి వాటి అభివృద్ధి, పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాల కమిటీ చైర్మన్ బండి ఓబిలేశు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, గ్రామంలో పలు సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకరిస్తున్న 'మన ఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల పరిసరాలను శుభ్రపరచడం ద్వారా విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించారని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తా సుధీర్ రాయల్, ఉప్పల రామకృష్ణ, సామల చెంగయ్య, జానపాటి కృష్ణయ్య, సుబ్బరాయుడు, సామల రాజి, సుబ్బలక్షుమ్మ, సుబ్బరత్న, గౌడ ఆనంద్, సిరివల్లి, సుబ్బారావు, సామల కుమార్, సిరిసాల ఓబిలేశు తదితరులు పాల్గొన్నారు.


# 47వ డివిజన్‌లో ముమ్మరంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్': స్వచ్ఛ కడపకు ఎమ్మెల్యే మాధవి పిలుపు



**కడప మన జనప్రగతి జూన్ 11:-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా కడప నగరపాలక సంస్థ పరిధిలోని 47వ డివిజన్‌లో శుభ్రత కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఆధ్వర్యంలో నభికోట, అక్కయపల్లి పార్క్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్ర, డివిజన్ ఇన్‌చార్జి రెడ్డి హుస్సేన్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. రోడ్లు, డ్రైన్లు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే తడి, పొడి, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేందుకు ఉపయోగించే ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగుల డస్ట్‌బిన్ల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. చెత్తను వర్గీకరించి ఇవ్వడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. డివిజన్‌లోని ప్రజా సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య పనులు, వీధి దీపాల మరమ్మతులు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, "స్వచ్ఛ కడప" లక్ష్య సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీ ఖాన్, రెడ్డయ్య యాదవ్, చిట్టిపోయిన సుబ్బరాయుడు యాదవ్, సుబ్బారెడ్డి, గౌతమ్, హరి, జీవన్ పాల్, రమేష్, చిన్న బాలాజీ, అన్నపూరి హుస్సేన్, ఇబ్రహీం హుస్సేన్, చిన్న హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో జాప్యంపై ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆగ్రహం

- **రూ. 830 కోట్లు విడుదల చేసినా పంపిణీ ఎందుకు ఆలస్యం.?**
- **తక్షణమే విద్యాసామగ్రి అందజేయాలని డిమాండ్**




**అనంతపురం మన జనప్రగతి జూన్ 11:-** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయాల్సిన సర్వేపల్లి రాధాకృష్ణన్ 'విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థులకు విద్యాసామగ్రిని వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రతినిధి సిద్ధూ మాట్లాడుతూ, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ. 830 కోట్లు విడుదల చేసినప్పటికీ ఇప్పటికీ విద్యార్థులకు కిట్లు అందకపోవడం బాధాకరమన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, ముడి చమురు కొరత వంటి కారణాలను సాకుగా చూపుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కిట్ల తయారీ, పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమైన పది రోజుల్లోపు ప్రతి విద్యార్థికి విద్యార్థి మిత్ర కిట్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ తదితర విద్యాసామగ్రిని ఒకేసారి పంపిణీ చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మానాలని, విద్యార్థుల హక్కులను కాపాడాలని సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యాసామగ్రి పంపిణీని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నిరుపేదల ఇంటి స్థలాలపై కన్నేసిన భూ బకాసురులు..!

- **జెసిబి యంత్రంతో స్థలాలు చదును చేసిన వైనం**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 11:-** మండలంలోని శాఖరాజుపల్లి గ్రామంలో నిరుపేదలకు మంజూరైన ఇంటి స్థలాలపై కబ్జా యత్నాలు జరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 460లో 2012లో పక్కా గృహాల నిర్మాణం కోసం లబ్ధిదారులకు మంజూరు చేసిన స్థలాలను కొంతమంది స్థానికేతరులు జేసీబీ యంత్రాలతో చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే భూ బకాసురులు రెచ్చిపోతూ నిరుపేదల ఇంటి స్థలాలు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ స్పందిస్తూ, సర్వే నంబర్ 460లో జరుగుతున్న పనులు తమ దృష్టికి రావడంతో వెంటనే నిలిపివేశామని తెలిపారు. సంబంధిత రికార్డులను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని, అప్పటి వరకు ఎవరూ ఎలాంటి పనులు చేపట్టరాదని ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు లేదా రెవెన్యూ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆర్ఎంపీలు పరిమిత వైద్యం మాత్రమే చేయాలి: డాక్టర్ రంగలక్ష్మి



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 11:-** మండలంలోని పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిద్ధవటం గ్రామంలో వైద్యాధికారిణి డాక్టర్ పి. రంగలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ క్లినిక్‌లను సందర్శించిన ఆమె, ఆర్ఎంపీలు ప్రజలకు ప్రథమ చికిత్స, ఆరోగ్య సలహాలు మాత్రమే అందించాలని, సూదులు, సెలైన్‌లు, ఆక్సిజన్, ఆపరేషన్లు, అబార్షన్లు వంటి వైద్య సేవలు అందించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అనంతరం క్షయవ్యాధితో బాధపడుతున్న మహిళను పరామర్శించి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. అలాగే ఎస్సీ బాలికల వసతిగృహాన్ని సందర్శించి పరిశుభ్రత, తాగునీటి ట్యాంకుల శుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, అలాగే 'బేటీ బచావో - బేటీ పడావో' కార్యక్రమం కింద బాల్య వివాహాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, ఏఎన్ఎం శారద, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, అంగన్‌వాడీ టీచర్ సరోజమ్మ, ఎస్సీ హాస్టల్ వార్డెన్ సరస్వతి, ఆశా కార్యకర్త ఓబులమ్మ పాల్గొన్నారు.

# మాధవరంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..

- **యువత క్రీడారంగంలో రాణించాలి: లోకేష్ రాజు**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 11:-** యువత క్రీడారంగం పట్ల ఆసక్తి పెంపొందించుకుని ప్రతిభ చాటాలని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చమర్తి తనయుడు లోకేష్ రాజు అన్నారు. మండలంలోని పార్వతీపురం గ్రామ ప్లేగ్రౌండ్‌లో గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26 జట్లతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో తొలి రోజు సిద్ధవటం, మాచుపల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఈ నెలాఖరులో బహుమతులు అందజేస్తామని చెప్పారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి దారపునేని రాజానాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, నాగమునిరెడ్డి, వీరనాల రామచంద్రయ్య, మామిడి సుబ్బారెడ్డి, నాగభూషణం, పార్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


# కువైట్‌లో ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు





**సుండుపల్లి మన జనప్రగతి జూన్ 11:-** తెలుగు ప్రజల అభిమాన నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను కువైట్‌లోని మాలియా ప్రాంతంలో తెలుగు ప్రవాసులు ఘనంగా నిర్వహించారు. బీబీక్యూ రెస్టారెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని సుగవాసి యువసేన అధ్యక్షుడు కంచన రెడ్డిశేఖర్ (ఎన్ఆర్ఐ టీడీపీ), ఎన్ఆర్ఐ ఏపీ టీడీపీ యూత్ కువైట్ అధ్యక్షుడు ఖాన్ భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన జన్మదిన కేక్‌ను కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. వక్తలు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో బాలకృష్ణ అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రజా సేవలో ఆయన చూపుతున్న అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి మరింత స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు వెంకట్ కోడూరి, సుగవాసి సాయి కిరణ్, రషీదా బేగం, సుగుణమ్మ, కువైట్ జనసేన అధ్యక్షుడు హరి రాయల్‌తో పాటు పలువురు తెలుగు ప్రవాసులు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. తెలుగు ప్రవాసుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. బాలకృష్ణ పట్ల అభిమానులకు ఉన్న ప్రేమాభిమానాలను ఈ కార్యక్రమం మరోసారి ప్రతిబింబించింది.

# వేంపల్లె స్మశాన వాటికల వివరాలు ఇవ్వండి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 11:-** వేంపల్లి మండలం లోని ఆయా గ్రామాల్లో ఉన్న స్మశాన వాటికల వివరాలు ఇవ్వాలని మండల డిప్యూటీ ఎంపీడీవోలు రామ్మోహన్ రెడ్డి, రమణయ్యలు తహసిల్దార్ జల్లా శివ శంకర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం వారు తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆయనను కలిసి ఈ వివరాలు అడిగారు. మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్ని స్మశాన వాటికలు ఉన్నాయి.. వాటి విస్తీర్ణం ఎంత, చుట్టూ ప్రహరీలు ఉన్నాయా లేవా, మౌలిక వసతుల గురించి వివరాలు ఇవ్వాలని తహసిల్దార్ వారు కోరారు. అలాగే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున మండలంలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు ఉన్నాయా లేవా ఎన్ని బ్యాలెట్ బాక్సులు ఉండాలి ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి అన్న విషయాల గురించి తమకు వివరాలు తెలియజేయాలని వారు తహసిల్దారును కోరారు. సత్వరం వీటి వివరాలను డిప్యూటీ ఎంపీడీవో లకు ఇవ్వాలని తహసిల్దార్ శివ శంకర్ రెడ్డి కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

# కాలవ ఫౌండేషన్ క్రికెట్ టోర్నీ విజేతగా శ్రీధరఘట్ట ఎస్.జి లయన్స్ జట్టు - ట్రోపి అందజేసిన,ఎమ్మెల్యే కాలవ,తనయుడు కాలవ భరత్



**బొమ్మనహాళ్ మన జనప్రగతి జూన్ 11:-** మండల పరిధిలోని జేఎస్‌డబ్ల్యూ క్రీడా మైదానంలో కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగిన క్రికెట్ అభిమానులను అలరించింది, ఫైనల్ మ్యాచ్ లో సంధర్బంగా బండూరు జట్టు,ఎస్‌జి లయన్స్ శ్రీధరఘట్ట జట్ల మధ్య జరిగిన తుది పోరులో ఎస్‌జి లయన్స్ శ్రీధరఘట్ట జట్టు విజేతగా నిలిచింది,ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు, కాలవ ఫౌండేషన్ చైర్మన్ కాలవ భరత్ హాజరై విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20,వేలు నగదు బహుమతి,రన్నరప్ బండూరు జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10,వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా కాలవ భరత్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని,క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు,ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడాలని,గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే కాలవ ఫౌండేషన్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, కే.మహేంద్ర, ఎంపీపీ ముల్లంగి నారాయణస్వామి,మండల కన్వీనర్ మల్లన్న, నాయకులు కేశవరెడ్డి,బలరాంరెడ్డి,పయ్యావుల అనిల్,మండల ప్రధాన కార్యదర్శి మల్లీడు శ్రీనివాసులు,బండూరు మల్లికార్జున, నవీన్,రమేష్,సగర రవిచంద్ర,తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల విద్యే సమాజ ప్రగతికి పునాది:ఎంపీజే




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 11:-** మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో "బ డికి పోదాం - భవిష్యత్తును నిర్మిoచుకుందాం!" అనే నినాదంతో విద్యా జాగృతి ఉద్యమాన్ని ప్రొద్దుటూరు మండలంలోని సోములవారి పంచాయతీ పరిధిలోని పెన్నా నగర్, ఈశ్వర్ రెడ్డి నగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీజే కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహించారు. ప్రతి చిన్నారికి విద్య హక్కు అని,విద్య ద్వారానే వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం,సీమ ఇంచార్జి అయూబ్ ఖాన్,జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి మాట్లాడుతూ...భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఎ ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ఉచిత, నిర్బంధ విద్య అందించడం ప్రాథమిక హక్కు అని తెలిపారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారమని, ప్రతి కుటుంబం తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. "ప్రతి బిడ్డ బడిలోకి - ప్రతి కుటుంబం వెలుగులోకి" అనే లక్ష్యంతో విద్యా జాగృతి ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

# స్కూల్ వ్యాన్ ఢీ – వ్యక్తి మృతి



**చక్రాయపేట మన జనప్రగతి జూన్ 11:** చక్రాయపేటలో సురభి నాగులగట్టు పల్లె వద్ద స్కూల్ వ్యాన్ ఢీ కొనడంతో ఆంజనేయులు (45)అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ప్రసాద్ అంగడి వద్ద కూర్చొని ఉండగా ప్రమాదవ శాత్తు స్కూల్ వ్యాన్ అంగడి లోనికి దూసుకుని వెళ్లడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది.ప్రమాద స్థలానికి చేరుకుంటున్న చక్రాయపేట పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.సురభి నాగలగుట్టపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


# ఉరవకొండ ఎంఈఓపై విద్యార్థి సంఘాల ఫిర్యాదు

**- సీఎస్‌సీ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో నిర్లక్ష్యం జరిగిందని ఆరోపణలు - సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఆర్‌వోకు వినతి**



**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 11:**–ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎస్‌సీ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ఉరవకొండ మండలంలో సక్రమంగా అమలు చేయలేదని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకుందని, మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను సందర్శించకుండా కొద్ది పాఠశాలల వివరాలతోనే నివేదిక రూపొందించారని ఆరోపించారు.విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లో సమగ్రంగా సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాల్సి ఉండగా, అది జరగలేదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో సీఎస్‌సీ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


# కువైట్‌లో ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 11:**–కువైట్ దేశంలోని మాలియా ప్రాంతంలో తెలుగు దేశం పార్టీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుగవాసి యువసేన అధ్యక్షుడు కంచన రెడ్డిశేఖర్ (ఎన్నారై టీడీపీ) ఆధ్వర్యం వహించగా, ఎన్నారై ఏపీ టీడీపీ యూత్ కువైట్ అధ్యక్షుడు ఖాన్ భాయ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బాలకృష్ణ సేవలను కొనియాడిన నాయకులు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీజనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరికీ ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్నారై టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు వెంకట్ కోడూరి, సుగవాసి సాయి కిరణ్, రషీదా బేగం, సుగుణమ్మ, కువైట్ జనసేన అధ్యక్షుడు హరి రాయల్, చిన్న రాజు, ఖదురున్, ప్రసాద్ రాయల్, సిరిశెట్టి మల్లికార్జున్, శ్రీనివాస్, గుగ్గిళ్ల నాగార్జున్, అలీ షేక్, అజ్మత్, వేణు రాజు, వెంకీ చౌదరి, లక్ష్మి రెడ్డి, సుంకర నరేష్, మహబూబ్ భాషా, సహదేవ, ఆచారి, ఆవుల నాగరాజు, నాగప్రసాద్, మొహమ్మద్ అలీ, భోడక మల్లికార్జున, కందల నాగరాజు, ముద్దం తిరుమలయ్య, అన్వర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.పెద్ద ఎత్తున హాజరైన అభిమానులు, నాయకులు బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కందికుంట ప్రసాద్‌కు ఘన సత్కారం

**- తిరుపతి బహిరంగ సభ ఏర్పాట్లపై ప్రశంసలు: గాజుల ఖాదర్ బాషా**



**అన్నమయ్య మన జనప్రగతి జూన్ 11:**–కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు రాయచోటి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు బయలుదేరుతున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా తెలిపారు.ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌ను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ సభ వేదిక కానుందని నాయకులు పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో ప్రజలు, పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, మహిళా నాయకురాళు ,, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్త నిర్వహణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 11:**–శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్త నిర్వహణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.గురువారం గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం యూనిట్ ను పరిశీలిస్తూ, కేవలం పేడను తీసుకొచ్చి వేయడం వర్మి కంపోస్టు తయారీ కాదని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి పని తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు.శాస్త్రీయ విధానాలను అనుసరించి వర్మి కంపోస్టు తయారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.గ్రామాల్లో తడి, పొడి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేసి, సక్రమంగా నిర్వహించడం ద్వారా మాత్రమే మెరుగైన పారిశుధ్య ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సంబంధిత వారిని ఆదేశించారు. శాస్త్రీయ పద్ధతుల్లో వర్మి కంపోస్టు తయారీ పై అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. జూలై మొదటి నాటికి అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలలో శాస్త్రీయ పద్ధతుల్లో వర్మి కంపోస్టు తయారీ కనపడకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డి పి ఓ భాస్కర్, గూడూరు తహసిల్దార్ వెంకటేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# హార్సీ హిల్స్‌ను ప్లాస్టిక్ రహిత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదాం: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**హార్సీ హిల్స్,మన జనప్రగతి జూన్ 11:**– ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2026 మరియు యోగాంధ్ర కార్యక్రమాల సందర్భంగా హార్సీ హిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ” నినాదంతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన ఆర్.ఓ. తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించడంతో పాటు, ప్లాస్టిక్ సీసాలకు ప్రత్యామ్నాయంగా గాజు సీసాలు, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యలను పరిశీలించారు.హార్సీ హిల్స్ వంటి ప్రకృతి సౌందర్య ప్రాంతాలను కాలుష్య రహితంగా కాపాడుకోవడం అందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించవచ్చన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబతో పాటు వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో సోర్స్ కనెక్టివిటీ, చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 11:**– జిల్లాలో సోర్స్ కనెక్టివిటీ, చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు సోర్స్ కనెక్టివిటీ కల్పించడం, నీటి వనరుల పునరుద్ధరణ, చెరువుల అనుసంధానం మరియు బ్రీచ్ అయిన నీటి వనరుల పునరుద్ధరణ అంశాలపై గురువారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన వాసర్ ల్యాబ్స్ నిపుణులు సమర్పించిన నివేదికలు, మ్యాపుల ఆధారంగా జిల్లాలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించడంపై విస్తృతంగా చర్చించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సోర్స్ కనెక్టివిటీకి ఉన్న అవకాశాలను మ్యాపుల ద్వారా ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా సోమల, కలికిరి, పెద్దమండ్యం మరియు ఇతర మండలాల్లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు సమీప జలవనరుల ద్వారా అనుసంధానం కల్పించగల ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు.జిల్లాలో బ్రీచ్ అయిన చెరువులు, నీటి వనరులను పునరుద్ధరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎక్కడెక్కడ సోర్స్ కనెక్టివిటీ అవసరమో గుర్తించి, ఆయా పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అందుబాటులో ఉన్న వివిధ నిధుల ద్వారా అత్యవసర పనులకు ఆమోదం తెలుపుతూ, పనులను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వ్యవసాయానికి స్థిరమైన నీటి వనరులు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు, ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకట్రామయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం

**● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 11:**–రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్రను రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతించారు.మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే షాజహాన్ బాషా నివాసంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్రకు సుగవాసి ప్రసాద్ బాబు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.సమావేశంలో కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి,తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు దినేష్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, శ్రీరామ్ చినబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం,ప్రజా సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నాయకత్వం ఏకతాటిపై నడిస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు.“తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలే మా బలం.. ప్రజాసేవే మా ధ్యేయం.. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక” అని నాయకులు స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

# కలెక్టరేట్ ఎదుట ప్రజాబలం ఆమరణ దీక్ష

**- గార్లదిన్నె భూకుంభకోణంపై విచారణ జరపాలని డిమాండ్**




**అనంతపురం మన జనప్రగతి జూన్ 11:**–గార్లదిన్నె మండలంలో ప్రభుత్వ భూముల అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాబలం సంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష గురువారం కొనసాగింది. ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు న్యాయం చేయాలంటూ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రజాబలం సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రామప్ప నాయక్ మాట్లాడుతూ, గార్లదిన్నె మండలంలో విలువైన ప్రభుత్వ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా దళారుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం వెంటనే విచారణ జరిపి అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అక్రమాల ద్వారా ఆక్రమితమైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పెనకచర్ల గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు లేదా సాగు భూములుగా పంపిణీ చేయాలని కోరారు. పేదల సమస్యలపై జిల్లా యంత్రాంగం స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు.భూ అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగే వరకు ఆమరణ దీక్షను విరమించబోమని నాయకులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాబలం సంఘం నాయకులు మేఘన, వీరతేజ, అబ్దుల్ గఫూర్, మహబూబ్ బాషా, కార్తీక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే పాలన అందిస్తున్నాం: మంత్రి సవిత



**పెనుకొండ,మన జనప్రగతి జూన్ 11:**– కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శక పాలన అందిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. గురువారం పెనుకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు.అమరావతి, పోలవరం, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు చేస్తూ, ఆయన పాలనలో అభివృద్ధి కంటే రాజకీయ కుట్రలకు ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక, హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# వేంపల్లెలో తెలుగు తమ్ముళ్ల విజయోత్సవ బైక్ ర్యాలీ



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 11:**– వేంపల్లి లో గురువారం తెలుగు తమ్ముళ్లు మోటార్ బైక్ లపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా మండల తెదేపా కన్వీనర్ సింగా రెడ్డి రామ మునిరెడ్డి నేతృత్వంలో తెలుగు తమ్ముళ్లు ఈ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి పులివెందుల రోడ్డు మీదుగా ఈ మోటార్ బైకుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం పులివెందుల బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రామ మునిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్ల క్రితం అరాచక పాలన సాగించిన వైకాపా ను కూటమి నేతలు నిలువరించి అధికారం చేపట్టారన్నారు. చంద్రబాబు పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలై అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో మరింత మెరుగైన పాలన అంది ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, తెదేపా పట్టణ శాఖ అధ్యక్షుడు నామా వేమ కుమార్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ భాషా, క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా,మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ షేక్ వలి, యూనిట్ సభ్యులు జబీబుల్లా, డక్కా రమేష్,టీడీపీ నాయకుడు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి, కుమ్మరాంపల్లి రెడ్డయ్య, బాల ప్రతాప్, కుప్పాల పల్లె చంద్రశేఖర్ రెడ్డి, మడక శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

12 - 06 - 2026

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**• పోలీస్ పెరేడ్ మైదానంలో యోగాంధ్ర -2026 కార్యక్రమంలో**

**జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**



**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 11:** యోగా ద్వారా.. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం ఉదయం పోలీస్ పెరేడ్ మైదానం లో యోగాంధ్ర -2026 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వయంగా యోగసనాలు వేసి సిబ్బంది లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని పోలీస్ అధికారులు, సిబ్బంది కి సూచించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులకు జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ (ఎ.ఆర్ ) బి. రమణయ్య స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్పీ ఎన్. సుధాకర్ , కడప ఇంచార్జ్ డి.ఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి, ఆర్.ఐ లు, కడప నగరంలోని సి.ఐ లు, ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర 2047 పి4 పేదరిక నిర్మూలన ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు



**తిరుపతి మన జనప్రగతి జూన్ 11:-** స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాల్లో ఒకటైన పేదరిక నిర్మూలన ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ లో భాగంగా యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన మరియు ఆర్థిక సాధికారత ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించబడ్డాయని ఆమె పేర్కొన్నారు. ఈ లక్ష్యాల సాధనలో భాగంగా అమరా హాస్పిటల్, తిరుపతి ఆధ్వర్యంలో నర్సింగ్ అసిస్టెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించబడుతోందని తెలిపారు. ఆరోగ్య రంగంలో ఆసక్తి కలిగిన యువతకు నాణ్యమైన శిక్షణతో పాటు భవిష్యత్తులో స్థిరమైన ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఈ కార్యక్రమం రూపొందించబడిందని వివరించారు. కార్యక్రమం ముఖ్యాంశాలు- 2 సంవత్సరాల సమగ్ర శిక్షణ - శిక్షణ కాలంలో నెలవారీ స్టైపెండ్ - ఆధునిక వైద్య సదుపాయాల్లో ప్రాక్టికల్ అనుభవం - శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు - పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి - గ్రామీణ మరియు ఆర్థికంగా వెనుకబడిన యువతకు ప్రాధాన్యత అర్హతలు- 8వ తరగతి ఉత్తీర్ణత - వయస్సు: 16 20 సంవత్సరాలు - సేవాభావం మరియు నేర్చుకోవాలనే ఆసక్తి తిరుపతి నియోజకవర్గంలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్య రంగంలో తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని కమిషనర్ శారదా దేవి పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం సంప్రదించండి: CVAP టీమ్ రాజశేఖర్ 88867 47853

# మెగా డీఎస్సీ,క్రీడా కోటాపై జగన్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధం

**• జూన్ 13న తిరుపతిలో బహిరంగ చర్చకు సిద్ధమా?:**

**ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



**అమరావతి/పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 11**:మెగా డిఎస్సీ 2025 మరియు మెరిటోరియస్ స్పోర్ట్స్ కోటా నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన విమర్శలను టీడీపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు. గురువారం అమరావతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మెగా డిఎస్సీపై జగన్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధం అని జూన్ 13న తిరుపతిలో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సవాల్ విసిరారు.కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపట్టిన మెగా డిఎస్సీ,క్రీడా కోటా నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కళ్లార్పకుండా పచ్చి అబద్ధాలు వల్లెవేస్తున్నారని టీడీపి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.నియామక ప్రక్రియ అంతా వెబ్‌సైట్‌లో బహిరంగంగా ఉంచినప్పటికీ,కళ్లు లేని కబోదిలా జగన్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.క్రీడాకారుడు యాదయ్యకు అన్యాయం జరిగిందంటూ తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్బంధించి రాజకీయం చేస్తున్నారని రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు.యాదయ్య తన దరఖాస్తుతో పాటు సరైన జాతీయ మెడల్ సర్టిఫికేట్ జత చేయకుండా కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్ సమర్పించడం వల్లే నిబంధనల ప్రకారం ఎంపిక కాలేదని,ఈ విషయాన్ని సదరు అభ్యర్థి అధికారుల వద్ద లిఖితపూర్వకంగా అంగీకరించారని స్పష్టం చేశారు.అదే సమయంలో గత వైసీపీ హయాంలో గ్రామ,వార్డు సచివాలయాల్లో 2,300 మందికి ఉద్యోగాలిస్తే అందులో అత్యధికులు కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్లతో వచ్చినవారేనని ఆధారాల లిస్టును బయటపెట్టారు.బాల్ బ్యాడ్మింటన్ అనే ఆట ఎక్కడుందని జగన్ అడుగుతున్నారు.మా పులివెందులలో వైఎస్సార్ కుటుంబ సమాధుల వంకబడి గోడ పక్కనే 20 ఏళ్లుగా టాప్ బ్యాడ్మింటన్ కోర్టు ఉంది.సొంత ఊరి చరిత్ర తెలియని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తారా? అని ఎద్దేవా చేశారు.జగన్ తనను తాను ఏపీ కాక్రోచ్ (బొద్దింక) గా సంబోధించుకోవడాన్ని ఎద్దేవా చేస్తూ రాష్ట్ర వనరులను దోచుకున్న అవినీతి సామ్రాట్ ఆయనేనని విమర్శించారు.ఒకవైపు ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి విద్యావ్యవస్థలో అద్భుత ఫలితాలు సాధిస్తున్న 16 వేల మంది నిరుద్యోగ కుటుంబాలలో జగన్ భయాందోళనలు సృష్టిస్తున్నారని ఇది తీవ్రవాదం కంటే దారుణమన్నారు.ఈ నియామకాలపై తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని జూన్ 13వ తేదీ (శనివారం) ఉదయం 11 గంటలకు తిరుపతి ప్రెస్ క్లబ్ వేదికగా బహిరంగ చర్చకు సిద్ధమని వైసీపీ నుండి ఎవరైనా సరే రావాలని రాంగోపాల్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్ విసిరారు.

# దుబాయ్‌లో టాక్సీ డ్రైవర్ ఉద్యోగాలకు అవకాశం

**• ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నియామకాలు • జూన్ 28 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 11:-** విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) శుభవార్త అందించింది. దుబాయ్ (యూఏఈ)లో టాక్సీ డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఏ. సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉద్యోగాలకు 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులు. కనీసం పదో తరగతి (SSC) ఉత్తీర్ణతతో పాటు చెల్లుబాటు అయ్యే భారతీయ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు నెలకు AED 4000 నుంచి AED 5000 వరకు సంపాదించే అవకాశం ఉందని పేర్కొన్నారు.యూఏఈ డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు వసతి సౌకర్యాన్ని సంస్థ కల్పించనుండగా, వీసా మరియు విమాన ప్రయాణ ఖర్చులను కూడా యాజమాన్యమే భరిస్తుందన్నారు. అభ్యర్థులు బయోడేటా, పాస్‌పోర్ట్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హత ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌తో హాజరు కావాల్సి ఉంటుందన్నారు.దరఖాస్తుల నమోదు చివరి తేదీ జూన్ 28 కాగా, ఇంటర్వ్యూలు జూన్ 29న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలు కడప నూతన కలెక్టరేట్‌లోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం, ఎఫ్-6, ఓ బ్లాక్‌లో గల ఎంసీసీ కేంద్రంలో జరుగుతాయన్నారు.మరిన్ని వివరాలకు : 9988853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. విదేశీ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగ యువతకు ఆయన పిలుపునిచ్చారు.

# ప్రకృతి వ్యవసాయంపై పొదుపు మహిళలకు అవగాహన




**దేవనకొండ మన జనప్రగతి జూన్ 11:-**దేవనకొండ మండలం కప్పట్రాల గ్రామంలోని గ్రామజ్యోతి కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి మాధురి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. బంగ్లాదేశ్ ప్రతినిధి అబ్దుల్ జబోం సోహెల్, ఢిల్లీకి చెందిన సుధా నారాయణన్ కూడా హాజరయ్యారు.హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎన్ఎఫ్ఎఫ్ ప్రతినిధి గౌతమి చిరుధాన్యాలతో తయారుచేసే స్నాక్స్, వాటి పోషక విలువలపై అవగాహన కల్పించారు. జిల్లా యాంకర్ అరుణమ్మ గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, పోషకాహార భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలు, 'ప్రతి నేల ఫుడ్ బాస్కెట్' మరియు సహజ వ్యవసాయ కార్యక్రమాల గురించి వివరించారు.మహిళలతో ప్రకృతి వ్యవసాయం అమలు తీరుపై చర్చించి, దాని ప్రయోజనాలను గ్రామజ్యోతి అధ్యక్షురాలు విజి భవాని ద్వారా తెలుసుకున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని సూచించారు.కప్పట్రాల గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐజి ఆకే రవికృష్ణ ఐపీఎస్ వర్చువల్‌గా పాల్గొని గ్రామాన్ని పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతు బి. రంగస్వామి పొలాన్ని సందర్శించి అక్కడ అమలు చేస్తున్న నమూనాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు పండిస్తున్న రంగస్వామిని అభినందించి, ఆయన పొలంలో కొబ్బరి మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో సే ట్రీస్ మేనేజర్ బి. నారాయణ, ఏపీఎం లక్ష్మమ్మ, వెలుగు సీసీ కర్రెన్న, పీఈ సందీప్, డీపీపీ శ్వేత, ఎన్ఎఫ్ఏ బుజ్జేశ్వరుడు, ఎఫ్ఎంటి సుధాకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి: విద్యార్థి యువజన సంఘాలు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 11:-**ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన సంఘాలు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశాయి. తాడేపల్లిలో రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ రంజిత్ బాషా కు గురువారం వినతిపత్రం అందజేశారు. 202627 విద్యా సంవత్సరంలో గుర్తింపు లేని కళాశాలల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్లు, ప్రిన్సిపాళు ,, ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొన్ని కార్పొరేట్, మినీ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తాల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంపై పలు జిల్లాల ఆర్ఐఓలు, ఆర్‌జేడీలకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు గుర్తింపు రద్దు చేయడం లేదా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. గుంటూరు, కడప, ఒంగోలు, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, తిరుపతి, అనంతపురం, విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల పనితీరుపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్ కత్తి, తెలుగు రాష్ట్ర విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల జయరాజు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు అశోక్, ఎరుకల ప్రసాద్, ఆర్‌డీఎస్‌వో నాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ సంజీవిని: మంత్రి నారాయణ

**• సిటీ నియోజకవర్గంలో రెండేళ్లలో 4 కోట్ల భారీ సాయం**

**• 49 మందికి 32 లక్షల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి నారాయణ**



**నెల్లూరు మన జనప్రగతి జూన్ 11:** ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ అనేది పేదల పాలిట సంజీవిని గా పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 49 మంది లబ్ధిదారులకు 32,17,600 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి నారాయణ చేతులమీదుగా క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో 433 మందికి 4,04,98,692 విలువైన చెక్కులను అందజేసి ఆదుకున్నామని మంత్రి వెల్లడించారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా తాము ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి,దంత సురక్ష ద్వారా కేవలం 4 నెలల్లోనే 10 వేల మందికి వైద్య పరీక్షలు చేసి, ఐదు వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు, మరో ఐదు వేల మందికి దంత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిసెంబర్ కల్లా వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

# పులివెందుల మార్కెట్లోకి ఏషియన్ పెయింట్స్ 'రాయల్ లగ్జరీ ఎమల్షన్'



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 11:**కడప జిల్లా పులివెందుల పట్టణంలో ఏషియన్ పెయింట్స్ సంస్థ నూతన ఉత్పత్తి రాయల్ లగ్జరీ ఎమల్షన్ ఘనంగా ఆవిష్కరించబడింది. పట్టణంలోని ప్రముఖ రెడ్డెమ్మ పెయింట్ షాప్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ రీజినల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి ఏరియా మేనేజర్ పీవీవీ సుబ్రహ్మణ్యం పాల్గొని నూతన ఉత్పత్తిని మార్కెట్‌లోకి విడుదల చేశారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సాధారణంగా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమాలను పెద్ద నగరాల్లోని ఫంక్షన్ హాళ్లలో అట్టహాసంగా నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.అయితే తమ సంస్థ విజయానికి డీలర్ల పాత్ర ఎంతో కీలకమని,డీలర్లే ఏషియన్ పెయింట్స్‌కు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు.అందుకే డీలర్లకు ప్రాధాన్యత ఇస్తూ నేరుగా వారి వ్యాపార కేంద్రాల వద్దకే వచ్చి నూతన ఉత్పత్తులను లాంచ్ చేస్తున్నామని చెప్పారు.అందులో భాగంగానే పులివెందులలోని రెడ్డెమ్మ పెయింట్ షాప్‌లో ఈ నూతన రాయల్ లగ్జరీ ఎమల్షన్ ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు.ఈ నూతన ఉత్పత్తిని రెడ్డెమ్మ పెయింట్ షాప్ యజమాని బాలు చేతుల మీదుగా ప్రారంభించారు. వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత, ఆకర్షణీయమైన ఫినిషింగ్ మరియు ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ ఉత్పత్తి పెయింట్ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని సంస్థ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పెయింట్ డీలర్లు,వ్యాపారులు,సంస్థ ప్రతినిధులు మరియు పలువురు వినియోగదారులు పాల్గొన్నారు. పులివెందులలో నిర్వహించిన ఈ లాంచ్ కార్యక్రమం ఏషియన్ పెయింట్స్ సంస్థకు మరియు స్థానిక డీలర్లకు మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది.

# హౌసింగ్ గోడౌన్ కేసులో నిజాలు వెలికితీయాలని రాచమల్లు డిమాండ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 11:-** హౌసింగ్ గోడౌన్‌లో దాదాపు 268 టన్నుల ఇనుప కడ్డీలు మాయమైన ఘటనపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు. గురువారం దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచమల్లు మాట్లాడుతూ..పేదల గృహ నిర్మాణాల కోసం గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఇనుప కడ్డీలను 2022లో హౌసింగ్ గోడౌన్‌లో నిల్వ చేసినట్లు తెలిపారు. 2025 సెప్టెంబర్ 4న హౌసింగ్ పీడీ నిర్వహించిన తనిఖీలో కడ్డీలు గోడౌన్‌లోనే ఉన్నాయని, అనంతరం జరిగిన అధికారుల తనిఖీల్లో అవి మాయమైనట్లు గుర్తించారని పేర్కొన్నారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారి సుబ్రహ్మణ్యాన్ని విచారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని రాచమల్లు అన్నారు.కేసులో అసలు దోషులను గుర్తించి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి 2024 వరకు టీడీపీ మాజీ ఇంచార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, అనంతరం ప్రస్తుత ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూడా రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్థానికంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజలు ప్రశ్నిస్తున్న నేపథ్యంలో దృష్టి మళ్లించేందుకే తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో వర్షాకాలంలో గాంధీ రోడ్డులో అప్పర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ప్రస్తావించారు.మాయమైన ఇనుప కడ్డీలు ఎమ్మెల్యే తనయుడు నంద్యాల కొండారెడ్డి నిర్మిస్తున్న అపార్ట్మెంట్ల వద్దకు తరలించారని, ఇందులో ఎమ్మెల్యే పీఏల పాత్ర కూడా ఉందని ఆరోపించారు. పోలీసులు వెంటనే దర్యాప్తు వేగవంతం చేసి సూత్రధారులను ప్రజలకు వెల్లడించా లని,లేనిపక్షంలో రిలే దీక్షలు చేపడతానని రాచమల్లు హెచ్చరించారు.

# ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో గణనీయమైన పురోగతి

**పొగాకు కొనుగోళ్ల పరిస్థితిపై సహచర మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి మన జనప్రగతి జూన్ 11:-** ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సీవీ పొగాకు వేలం ప్రక్రియ గత పది రోజులుగా మెరుగుదల సంకేతాలను చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కొనుగోలుదారుల భాగస్వామ్యం పెరగడం, మార్కెట్‌లో లిక్విడిటీ మెరుగుపడడం, వేలం కేంద్రాల్లో తిరస్కరణలు గణనీయంగా తగ్గడం సానుకూల పరిణామాలని ఆయన పేర్కొన్నారు. పొగాకు కొనుగోళ్ల పరిస్థితిపై గురువారం సహచర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అలాగే పొగాకు పండించే జిల్లాల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. జూన్ 11 నాటికి టొబాకో బోర్డు ఆధ్వర్యంలోని వేలం వేదికల ద్వారా మొత్తం 15.65 మిలియన్ కిలోగ్రాముల ఎఫ్‌సీవీ పొగాకు మార్కెటింగ్ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాలకు ప్రస్తుతం రోజుకు సుమారు 8,000 బేళ్ల పొగాకు వస్తుండటంతో మార్కెటింగ్ ప్రక్రియ సజావుగా సాగడమే కాకుండా కొనుగోలుదారుల పాల్గొనడం కూడా మెరుగుపడిందన్నారు. ఇటీవలి కాలంలో అత్యంత ముఖ్యమైన పరిణామం తిరస్కరణలు "నో బిడ్" (చీశీ దీఱస) స్థాయిలు గణనీయంగా తగ్గడమేనని మంత్రి తెలిపారు. గతంలో 30 నుంచి 37 శాతం మధ్య ఉన్న తిరస్కరణల శాతం ప్రస్తుతం సుమారు 20 శాతానికి తగ్గిందని చెప్పారు. ఇది మార్కెట్‌లో పొగాకుకు మెరుగైన ఆదరణ లభిస్తోందనే విషయాన్ని సూచిస్తోందని, అలాగే వ్యాపార అవసరాలకు అనుగుణంగా పొగాకు సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు.ప్రస్తుతం నెలకొన్న మార్కెట్ పరిస్థితులపై సమగ్ర అవగాహన కోసం టొబాకో బోర్డు అన్ని వర్గాల భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 8న వ్యాపార వర్గాలు, ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతు ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని మార్కెట్‌లో లిక్విడిటీ పెంచేందుకు ఆచరణాత్మక వ్యూహాలపై చర్చించామని తెలిపారు. ఈ సమావేశాల్లో కొనుగోలుదారులు, వ్యాపార వర్గాలు అన్ని గ్రేడ్ల పొగాకును సమతుల్యంగా వేలానికి తీసుకువస్తే దేశీయ, ఎగుమతి మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా కొనుగోళ్లు మరింత పెంచే అవకాశం ఉంటుందని వెల్లడించారని చెప్పారు. మరోవైపు రైతులు కూడా తిరస్కరణలు తగ్గించి కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగితే అన్ని గ్రేడ్ల పొగాకును మార్కెట్‌కు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారని వివరించారు. సమావేశాల్లో అన్ని వర్గాల మధ్య సమతుల్య గ్రేడ్ల సరఫరా, కొనుగోలుదారుల భాగస్వామ్యాన్ని పెంచడం, వేలం కేంద్రాలకు నియంత్రిత స్థాయిలో పొగాకు రాకలు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తమైందన్నారు. ఈ నేపథ్యంలో టొబాకో బోర్డు అన్ని కొనుగోలు సంస్థలతో సమన్వయం చేస్తూ వారానికి కొనుగోలు లక్ష్యాలను నిర్దేశించి, పంటను క్రమబద్ధంగా మార్కెటింగ్ చేయడంతో పాటు రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను వేగంగా విక్రయించే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. దాదాపు పది రోజుల క్రితం ఉన్న పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం కొనుగోలు సంస్థలు తమ భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచి మరింత చురుకుగా పొగాకు కొనుగోళ్లు చేపడుతున్నాయని మంత్రి తెలిపారు. దీనివల్ల మార్కెట్‌లో సానుకూల వాతావరణం ఏర్పడి కొనుగోళ్లకు ఊపు వచ్చిందన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులు, వ్యాపార వర్గాలు, కొనుగోలుదారుల సహకారం కొనసాగడంతో పాటు టొబాకో బోర్డు చేపడుతున్న చర్యల ఫలితంగా రానున్న వారాల్లో మార్కెట్‌లో లిక్విడిటీ మరింత మెరుగుపడి కొనుగోలు, మార్కెటింగ్ కార్యకలాపాలు మరింత వేగవంతమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫ్యాక్షన్‌కు గుడ్‌బై..భక్తిమార్గంలో

# మొయిళ్లచెరువు

**● గ్రామస్తుల ఐక్యతకు సాయినాథ్ శర్మ ప్రశంసలు**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 11:-**ఒకప్పుడు ఫ్యాక్షన్ కార్యకలాపాలకు కేంద్రంగా పేరొందిన కమలాపురం నియోజకవర్గంలోని వీరపునాయునిపల్లె మండలం మొయిళ్లచెరువు గ్రామం నేడు ఆధ్యాత్మిక శోభతో వెలుగొందుతోందని ఏపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ పేర్కొన్నారు.గ్రామస్తులు ఫ్యాక్షన్ వాతావరణానికి వీడ్కోలు పలికి ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయడం అభినందనీయమని అన్నారు. గ్రామదేవతలైన గంగమ్మ, అంకాలమ్మ, ఎల్లమ్మ దేవతల ఆలయాలను గ్రామస్తులు, నాయకుల సహకారంతో నిర్మించి ప్రతిష్ఠించి మండల రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయినాథ్ శర్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు కలిసికట్టుగా లక్షల రూపాయలు ఖర్చు చేసి మూడు ఆలయాలను నిర్మించడం ఆదర్శనీయమన్నారు.ఒకప్పుడు ఫ్యాక్షన్ కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామం నేడు ప్రజల ఐక్యతతో శాంతి, ఆధ్యాత్మికత వైపు పయనించడం శుభపరిణామమని పేర్కొన్నారు.ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెరిగితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, పరస్పర విభేదాలు తొలగిపోయి శాంతియుత వాతావరణం నెలకొంటుందని తెలిపారు.గ్రామంలో శాంతి కుసుమాలు వికసించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సాయినాథ్ శర్మ గ్రామానికి చేరుకోగానే ఆలయ కమిటీ సభ్యులు, అభిమానులు బాణాసంచా పేల్చుతూ, శాలువాలు కప్పి, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# గవిమఠం భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై దేవాదాయ శాఖ చర్యలు

**- కబ్జా భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు..త్వరలో బహిరంగ వేలం**








**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 11:-**ఉరవకొండ శ్రీ గవిమఠం సంస్థానానికి చెందిన కోట్ల రూపాయల విలువైన భూముల అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో దేవాదాయ శాఖ ఎట్టకేలకు చర్యలు ప్రారంభించింది. విజయవాడ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా రూపనగుడి తాలూకా చెళ్ళగురికి గ్రామ పరిధిలో ఉన్న మఠం భూములను పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.శ్రీ గవిమఠం సంస్థానానికి చెందిన 22.40 ఎకరాల భూమి గతంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయబడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ భూమిని గుంతకల్లు మాజీ ఈఓ మల్లికార్జున తన కుటుంబ సభ్యుల పేర్లపై విభజించి నమోదు చేయించుకున్నారని, అనంతరం సాగు కూడా చేపట్టినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ వ్యవహారాన్ని జిల్లా సమాచార హక్కు చట్టం కార్యదర్శి మీనుగ మధుబాబు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది.లోకాయుక్త ఆదేశాల అనంతరం భూములపై విచారణ జరిపిన అధికారులు, అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు ప్రారంభించారు. భక్తులు, లీగల్ సెల్ ప్రతినిధుల నిరసనల నేపథ్యంలో మొత్తం భూమిని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్లు వ్యక్తమయ్యాయి.ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, మేనేజర్ గంజి మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. సర్వే నంబర్ 111దీలో 3 ఎకరాల 35 సెంట్లు, సర్వే నంబర్ 114లో 19 ఎకరాల 05 సెంట్లు కలిపి మొత్తం 22.40 ఎకరాల భూమిని దేవాదాయ శాఖ ఆస్తిగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంజి మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ, మఠం ఆస్తుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం గుర్తించిన భూములను శాఖ ఆధీనంలోకి తీసుకున్నామని, ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.దీంతో గవిమఠం భూముల పరిరక్షణ కోసం సాగిన పోరాటంలో కీలక ముందడుగు పడినట్లు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

# యోగాంధ్ర-2026' ఫ్యామిలీ యోగా కార్యక్రమం






**● ఆరోగ్యమే మహాభాగ్యం: పులివెందుల డిఎస్పి మురళి నాయక్**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 11:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా పులివెందులలో ఫ్యామిలీ యోగా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేకకార్యక్రమంలో అధికారులు,ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.పులివెందుల డిఎస్పి మురళి నాయక్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య మరియు మున్సిపల్ కమిషనర్ మునికుమార్ ల ఆధ్వర్యంలో ఈ యోగా సాధన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.ఈ సందర్భంగా డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు మరియు ఏకాగ్రతకు యోగా ఒక అద్భుతమైన సాధనమని పేర్కొన్నారు. యోగాంధ్ర 2026 ముఖ్య ఉద్దేశం ప్రకారం సమాజంలో ప్రతి ఇంటికీ యోగాను తీసుకెళ్లి,ఆరోగ్యకరమైన ఆనందమయ సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ మరియు స్థానిక యంత్రాంగం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ప్రముఖ యోగా గురువు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ,నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక,శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వం లభించడమే కాకుండా,మానసిక ప్రశాంతత మరియు ఏకాగ్రత పెరుగుతాయని ఆయన వివరించారు.అనంతరం,కార్యక్రమానికి హాజరైన పోలీస్ సిబ్బంది,మున్సిపల్ అధికారులు,సచివాలయ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులకు యోగా గురువు పలు రకాల ఆసనాలను నేర్పించి,వారితో సాధన చేయించారు. యోగాంధ్ర 2026 కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రతి ఇంటిలోనూ యోగా అలవాటును పెంపొందించడమేనని,తద్వారా ఆరోగ్యకర మైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.పులివెందుల డివిజన్ పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు మున్సిపల్ సిబ్బంది,సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ - 2026 కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి



**స్పెషల్ ఇంసెంటీవ్ రివిజన్ 2026 శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**కడప,మన జనప్రగతి జూన్ 11:-** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంసెంటీవ్ రివిజన్ 2026) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించి అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు.గురువారం కలెక్టరేట్ లోని సభా భవన్ లో.. స్పెషల్ ఇంసెంటీవ్ రివిజన్ 2026 పై ఎస్ఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడీటీలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరై పీక్లు సూచనలిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 325, 326తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం1950, ఓటర్ల నమోదు నిబంధనల ఆధారంగా ఓటరు జాబితాల తయారీ, సవరణలు చేపట్టాల్సి ఉంటుందని వివరించారు.తరచూ ప్రజల వలసలు, ఒకే వ్యక్తి పేర్లు పలు ప్రాంతాల్లో నమోదు కావడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు తొలగించబడకపోవడం, విదేశీ పౌరుల అక్రమ నమోదు వంటి సమస్యలను నివారించేందుకే ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.ఎన్యూమరేషన్ దశలో బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూర్తి చేసిన ఫారాలను స్వీకరించి డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఇంటికి తాళం వేసి ఉంటే మూడు సార్లు సందర్శించి ఫారం అందించే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటరు సేవల పోర్టల్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఫారాలు సమర్పించుకునే అవకాశం కల్పించబడిందన్నారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అనంతరం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టాలని, ఒక్క పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను నమోదు చేయాలని చెప్పారు.డ్రాఫ్ట్ జాబితా ప్రచురణ తర్వాత ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. మ్యాపింగ్ లేని ఓటర్లు, లాజికల్ డిస్క్రిపెన్సీలు ఉన్న కేసులు, డిక్లరేషన్ సమర్పించని వారికి నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించాలని పేర్కొన్నారు.ఓటర్లను మ్యాప్డ్, అన్‌మ్యాప్డ్ వర్గాలుగా విభజించి పరిశీలిస్తామని, గత ఓటరు జాబితాలతో సరిపోలిన వారి వివరాలు సులభంగా ధృవీకరించబడతాయని, అనుమానాస్పద లేదా అసంగత వివరాలున్న వారికి విచారణ అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.జనన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణ విధానం అమలులో ఉంటుందని, 1987 జూలై 1కు ముందు జన్మించిన వారు తమ పత్రాలు మాత్రమే, ఆ తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రుల వివరాలతో కూడిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణిస్తారని, జనన తేదీ లేదా నివాస ధృవీకరణ పత్రంగా పరిగణించబోమని స్పష్టం చేశారు.ఎటువంటి అర్హ ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా, అలాగే అనర్హులు జాబితాలో చేరకుండా అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎవరి పేరు తొలగించే ముందు లేదా దరఖాస్తు తిరస్కరించే ముందు తప్పనిసరిగా విచారణ నిర్వహించాలని, తుది ఓటరు జాబితా ప్రచురణ అనంతరం అప్పీల్‌కు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయ వంతం కావడానికి అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిఆర్వో మల్లికార్జునుడు, కడప, బద్వేలు ఆర్డీవోలు మురళి, చంద్రమోహన్, ఎస్డీసి హరి ప్రసాద్, డిప్యూటీ కాలెక్టర్లు రంగస్వామి, శివరామిరెడ్డి, ఎస్ఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడీటీలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174